కొలువుల 'గ్యారెంటీ' గాలికి!

- కర్ణాటకలో ఉద్యోగుల కొరత
- మూడింట ఒక వంతు ఖాళీ
- 2.76 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల వేకెన్సీ
- ఏడాదిలో భర్తీ చేస్తామన్న కాంగ్రెస్
- గెలిచాక గ్యారెంటీల భారంతో దాటవేత
- కుంటుపడుతున్న ప్రభుత్వ సేవలు

బెంగళూరు, డిసెంబర్ 26: 'మేము అధికారంలోకి వస్తే ఏడాదిలో ప్రభుత్వ ఉద్యోగాల ఖాళీలు అన్నీ భర్తీ చేస్తాం' అంటూ గత ఏడాది జరిగిన కర్ణాటక అసెంబ్లీ ముందు కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. యువతను ఆకర్షించి ఓట్లు వేయించుకుంది. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి ఏడాది మీద ఏడు నెలలు గడుస్తున్నది. ఎన్నికల ముందు ఇచ్చిన మాట ఇప్పటివరకు నిలబెట్టుకోలేదు. పైగా పదవీ విరమణలతో ఖాళీల సంఖ్య మరింత పెరుగుతున్నది. ఈ ఒక్క ఏడాదే 20,466 ఖాళీలు పెరిగాయి. దీంతో ఇప్పుడు రాష్ట్రంలోని మూడింట ఒక వంతు ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. గ్యారెంటీల పేరుతో ఇచ్చిన ఉచిత హామీల భారంతో సిద్ధరామయ్య ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ ఊసే ఎత్తడం లేదు.

నిధులన్నీ గ్యారెంటీ పథకాలకే

కర్ణాటకలో 7.72 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఉన్నాయి. గత ఏడాది వీటిల్లో 2.55 లక్షల ఖాళీలు ఉండగా, ఇప్పుడు 2.76 లక్షలకు పెరిగాయి. అంటే, ప్రతి మూడు ఉద్యోగాల్లో ఒకటి ఖాళీ ఉన్నట్టు లెక్క. సిబ్బంది కొరతతో ప్రభుత్వ సేవలు కుంటుపడుతున్నాయి. చిన్న చిన్న పనులకు సైతం ప్రజలు నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తున్నది. కీలకమైన వ్యవసాయ శాఖలో ఏకంగా 65 శాతం ఖాళీలు ఉన్నాయి. మేనిఫెస్టోలో చెప్పినట్టు ఉద్యోగాలన్నీ భర్తీ చేస్తుందని ఆశతో కాంగ్రెస్‌కు ఓట్లేసిన యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నది. గ్యారెంటీల పేరుతో ఇచ్చిన ఉచిత హామీల ఆర్థిక భారం వల్లే ప్రభుత్వం ఉద్యోగ నియామకాలు చేపట్టడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటివరకు గ్యారెంటీలకు ప్రభుత్వం రూ.63,000 కోట్లు ఖర్చు చేసింది. ఈ పథకాలకే ఇంత ఖర్చు అవుతున్న నేపథ్యంలో కొత్త ఉద్యోగులకు వేతనాలు ఇచ్చే పరిస్థితి లేక ఉద్యోగాల భర్తీ చేపట్టడం లేదని ప్రతిపక్ష బీజేపీ విమర్శిస్తున్నది.

ఉద్యోగాలిచ్చే పని ప్రభుత్వానిది కాదట

ఎన్నికల ముందు కాంగ్రెస్ చెప్పిన మాటకు, ఇప్పుడు చెప్తున్న మాటలకు పొంత ఉండటం లేదు. ఉద్యోగాలు కల్పించేందుకు, సృష్టించేందుకు ప్రభుత్వం ఏమీ ఏజెన్సీ కాదని ఆ పార్టీ సీనియర్ ఎమ్మెల్యే, రాష్ట్ర పాలనా సంస్కరణల కమిషన్ చైర్మన్ ఆర్వీ దేశ్‌పాండే అన్నారు. ప్రైవేటు, ప్రభుత్వ రంగ సంస్థలు ఉద్యోగాలు కల్పిస్తాయని చెప్పారు. కొన్ని శాఖల్లో నియామకాలు అవసరం కాగా, పని భారం లేని వారి గురించి కూడా ప్రభుత్వం ఆలోచించాలని ఆయన వ్యాఖ్యానించారు.

మాల్డోవాపై దాడికి రష్యా సన్నద్ధం?

న్యూఢిల్లీ, డిసెంబర్ 26: సుమారు మూడేళ్లుగా ఉక్రెయిన్‌తో యుద్ధం చేస్తున్న రష్యా యూరప్‌లోని మరో దేశంపై దాడికి సన్నాహాలు చేస్తున్నట్టు ప్రచారం జరుగుతున్నది. చిన్నదైన మాల్డోవా దేశం ట్రాన్స్‌నిస్టియా ప్రాంతంలో సైనిక చర్యకు కుట్ర పన్నిందని పుతిన్ నేతృత్వంలోని రష్యా ప్రభుత్వం ఆరోపించింది. ఈ క్రమంలో రష్యా త్వరలోనే ఆ దేశంపై దాడికి దిగే అవకాశం ఉందని అల్ జజీరా వార్తా కథనంలో పేర్కొంది. కాగా, మంగళవారం మాల్డోవా అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేసిన సందు ఉక్రెయిన్ సరిహద్దుకు సమీపంలో ఉన్న ట్రాన్స్‌నిస్టియాలో మిలటరీ ఆపరేషన్ జరపాలని యోచిస్తున్నట్టు రష్యా నిఘాసంస్థ ప్రభుత్వాన్ని హెచ్చరించింది. ఉక్రెయిన్‌కు ఆయుధాలను సరఫరా చేయడానికి మాల్డోవాను నాటో స్థావరంగా మార్చుకుందని రష్యా విదేశాంగ శాఖ మంత్రి బుధవారం ఆరోపించారు. దీనిని సాకుగా చేసుకుని ఆ చిన్న దేశంపై రష్యా దండెత్తే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. అయితే రష్యా చేస్తున్న ఆరోపణల్లో ఎంతమాత్రం నిజం లేదంటూ మాల్డోవా కొట్టిపారేసింది.

ఆధారాలు లేకుంటే కేసు నిలవదు

ఒక ప్రభుత్వ నిర్ణయాలను తదుపరి వచ్చే ప్రభుత్వాలు కొనసాగించడం సాధారణం

- ఈ రేస్ కేసులో తన అధికార పరిధిలోనే లావాదేవీలున్నట్టు కేటీఆర్ నిరూపిస్తే చాలు
- సీబీఐ, ఈడీ విచారణ నిబంధనలకు విరుద్ధంగా ఉంటే న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చు
- ఫార్ములా ఈ-రేస్ కేసుపై 'నమస్తే తెలంగాణ'తో సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ ఇంటర్వ్యూ

హైదరాబాద్, డిసెంబర్ 26 (నమస్తే తెలంగాణ): ఫార్ములా ఈ-కార్ రేసింగ్ వ్యవహారంలో ఎలాంటి ఆధారాలు లేకుండా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఇరికించాలని చూస్తే కేసు నిలువదని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ స్పష్టంచేశారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచడం కోసం తన అధికారిక పరిధిలోనే ఆర్థిక లావాదేవీలు జరిగినట్టు కేటీఆర్ ఆధారాలను విచారణలో ఏసీబీకి సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ప్రజాధనం ఎక్కడా దుర్వినియోగం కాలేదని తేలితే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కేసు కూడా నిలువదని చెప్పారు. అవినీతి నిరోధకశాఖ (ఏసీబీ), కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) కేసు ఆధారంగా ఈడీ కేసు ఉంటుందని వివరించారు. ఈ కేసు విచారణకు నిలుస్తుందా? నిలువదా అనేది ఇప్పుడే చెప్పలేమని, విదేశీ మారకం నిబంధనలు ఏమిటి? ఆధారాలు ఏమిటి? వంటి అంశాలను పరిశీలించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఫార్ములా ఈ-కార్ రేసు వ్యవహారంలో ఉల్లంఘనలు జరిగాయనే ఆరోపణలపై ఏసీబీ కేటీఆర్ సహా ముగ్గురిపై కేసు నమోదు చేసిన నేపథ్యంలో సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణతో 'నమస్తే తెలంగాణ'తో ప్రత్యేకంగా మాట్లాడారు. గవర్నర్ అనుమతి, కేసు విచారణ, ఆర్బీఐ నోటీసు వంటి అనేక అంశాలను వివరించారు.

ఈ-రేస్ కేసులో నేరుగా డబ్బులు చేతులు మారింది లేదు. ఏసీబీ ఎందుకు ఎంటరైంది? దీన్ని ఎలా అర్థం చేసుకోవాలి?

2018లో ప్రివెన్షన్ ఆఫ్ కరప్షన్ యాక్ట్‌కు ఒక సవరణ తెచ్చారు. 2018 కంటే ముందు అవినీతి ఆరోపణలు వస్తే చాలు వెంటనే ఏసీబీ, సీబీఐ జోక్యం చేసుకొని విచారణ జరిపేది. 2018 సవరణ తర్వాత ఏ వ్యక్తిపై అయితే ఆరోపణ వచ్చిందో ఆ వ్యక్తికి సంబంధించిన హెచ్ఎండీఏ అనుమతిని ఏబీసీ తీసుకోవాల్సి ఉంటుంది. నేరుగా డబ్బులు తీసుకుంటూ చిక్కితే మాత్రం ఎవరి అనుమతీ తీసుకోవాల్సిన అవసరం లేదు. ఈ-కార్ రేసింగ్ విషయంలో కేటీఆర్ ఎమ్మెల్యే. డబ్బులు చేతులు మారలేదు. కేవలం ఆరోపణలు వచ్చినందున విచారించడానికి ముందుగా గవర్నర్ అనుమతి తీసుకున్నారు. ఆ తర్వాతే కేటీఆర్, ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్, హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిపై కేసు నమోదు చేశారు.

హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ కోసమే ఈ-కార్ రేస్ నిర్వహించారు కదా?

హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచడం కోసం నాలుగేండ్లకు ఒప్పందం చేసుకొని నాటి ప్రభుత్వం ఈ-కార్ రేసింగ్ నిర్వహించింది. ఈ రేస్ కోసం మిగతా నగరాలు కూడా పోటీ పడినా వాటిని తలదన్ని ఫిబ్రవరి 2023లో బ్రహ్మాండంగా జరిపారు. హైదరాబాద్‌కు రూ.700 కోట్ల ప్రయోజనం చేకూరినట్టు నెల్సన్ సంస్థ నివేదిక వెల్లడించింది. తర్వాత ఎన్నికలు వచ్చాయి. తనకు నష్టం వచ్చిందని గ్రీన్ కో సంస్థ స్పాన్సర్‌షిప్ నుంచి తప్పుకున్నది. నాటి ప్రభుత్వం రేస్ రద్దవుతుందని రూ.55 కోట్లు నిర్వహణ సంస్థకు చెల్లించింది. ఒకవేళ ఒప్పందం రద్దు చేసుకుంటే మాంట్రియల్ దేశం తరహాలో మనం జరిమానా చెల్లించాల్సి వస్తుందని ప్రభుత్వం భావించింది. మళ్లీ అధికారంలోకి వస్తామనే ధీమాతో తర్వాత స్పాన్సర్‌ను వెతుక్కుందామని అనుకున్నది. కానీ, బీఆర్ఎస్ ప్రభుత్వం రాలేదు. సాధారణంగా ఒక ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తదుపరి ప్రభుత్వాలు కొనసాగిస్తూ ఉంటాయి. నాలుగు రేసుల కోసం ఒప్పందం జరిగితే ఇక్కడ దాన్ని కొనసాగించలేదని తెలుస్తున్నది.

రిజర్వు బ్యాంకు ఎందుకు జోక్యం చేసుకున్నది?

విదేశీ సంస్థలకు డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి వచ్చినప్పుడు కొన్ని పద్ధతులు పాటించాల్సి ఉంటుంది. రూపాయలను విదేశీ మారకంలోకి మార్చడం కోసం నిబంధనలు పాటించకపోవడంతో రిజర్వు బ్యాంకు జోక్యం చేసుకొని నోటీసులు ఇచ్చినట్టు, రూ.8 కోట్లు డ్యామేజీ కింద చెల్లించినట్టు పేపర్లో చదివా.

ఈ కేసులో కేటీఆర్‌పై వచ్చిన ప్రధాన ఆరోపణ ఏమిటి?

ప్రధాన ఆరోపణ ఏమిటంటే నమ్మకంతో మీ దగ్గర డబ్బులు పెడితే నియమావళి పాటించకుండా, క్యాబినెట్ ఆమోదం లేకుండా, రిజర్వు బ్యాంకు పర్మిషన్ తీసుకోకుండా రూ.55 కోట్లు ఓ సంస్థకు చెల్లించారనేది! హెచ్ఎండీఏ చైర్మన్‌గా సీఎం, వైస్ చైర్మన్‌గా ఎంఏయూడీ మినిస్టర్ కేటీఆర్, మెంబర్ కన్వీనర్‌గా అర్వింద్‌కుమార్ ఉన్నారు. ఇందుకు క్యాబినెట్ అనుమతి అవసరం లేదని, వైస్ చైర్మన్‌గా నిర్ణయం తీసుకొనే అధికారం తనకు ఉన్నదని కేటీఆర్ స్పష్టంగా చెప్పారు. ఇది కరెక్టే. అయితే, కేటీఆర్ తన దగ్గర ఉన్న ఆధారాలను ఏసీబీకి ఇవ్వాల్సి ఉంటుంది. తనకు ఉన్న అధికార నిబంధనల మేరకు వ్యవహరించాను కాబట్టి కేసు క్లోజ్ చేయాలని కేటీఆర్ చెప్పాల్సి ఉంటుంది.

ఈ-రేస్ కేసులో కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు ఇవ్వాలా? అవసరం లేదా?

ఏడేండ్లకంటే తక్కువ శిక్ష పడే కేసుల్లో సీఆర్‌పీసీ నోటీసులు ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పు ఉన్నది. కానీ, 409 సెక్షన్ కూడా జోడించారు కాబట్టి పదేండ్ల జైలు/ జీవితఖైదుకు అకాశం ఉన్నది. నోటీసులు ఇవ్వకుండా కూడా ఏసీబీ విచారణ జరుపవచ్చు. ఏసీబీకి విస్తృతమైన అధికారాలు ఉంటాయి. చట్టంలో ఉన్న అనేక ప్రొవిజన్స్‌ను వారు వాడుకొనే అవకాశం ఉంటుంది.

కేసు తీవ్రత ఎలా ఉండనున్నది?

ఏసీబీ అధికారులు విచారణ జరిపి కేటీఆర్‌కు వ్యతిరేకంగా సాక్ష్యాధారాలు సేకరిస్తే కేసు నిలబడుతుంది అనుకొంటే చార్జిషీట్ వేస్తారు. ఒకవేళ ఎలాంటి సాక్ష్యాలు, ఆధారాలు లభించని పక్షంలో కేసుకు వెళ్లరు. ఆధారాలు లభించి చార్జిషీట్ దాఖలు చేస్తే కోర్టులో ట్రయల్స్ జరుగుతాయి. చివరికి శిక్షలు వేసిది కోర్టులు కాబట్టి తుది తీర్పును బట్టి శిక్ష అమలవుతుంది.

కేటీఆర్‌పై ప్రధాన అభియోగం ఏమిటి?

పబ్లిక్ సర్వెంట్ హోదాలో ప్రభుత్వ ఆస్తిని ఆధిపత్యం కలిగి ఉండి నేరపూరిత విశ్వాస ఉల్లంఘనకు పాల్పడినట్టుగా ఐపీఐ 409 సెక్షన్ జోడించారు. చాలా తీవ్రమైనది. ఈ సెక్షన్ ప్రకారం 10 ఏండ్ల జైలు లేదా జీవిత ఖైదు ఉంటుంది. అయితే, 13(1)ఏ సెక్షన్ కూడా పెట్టారు. ఇది ఏడేండ్లలోపే శిక్షకు సంబంధించిన సెక్షన్.

ఈ కేసులో ఈడీ ఏమి చేయబోతున్నది?

దేశంలో ఎక్కడైనా ఏసీబీ, సీబీఐ కేసుగానీ నమోదైదే ఈడీకి ఫిర్యాదు వెళ్తుంది. ఇక్కడ మనీలాండరింగ్ జరిగిందా? నల్లడబ్బును తెల్ల డబ్బుగా మార్చడం జరిగిందా? అనేది ఈడీ తేల్చుతుంది. ఈడీ అధికారులు ఎఫ్ఐఆర్ తరహాలో ఈసీఐఆర్ నమోదు చేస్తారు. ఏసీబీ, సీబీఐ కేసు ఆధారంగా ఈడీ కేసు ఉంటుంది. రూ.55 కోట్లు ఏమైనా పక్కదారి పట్టాయా? లేదా అనేది ఈడీ నిర్ధారిస్తుంది.

విచారణ పారదర్శకంగా లేకుంటే ఎలా ముందుకెళ్తుంది?

విచారణ సక్రమంగా జరగకపోతే హైకోర్టుకు వెళ్లవచ్చు. అక్కడ ఫిర్యాదు చేసి న్యాయం కోరవచ్చు. ఏమీ లేకుండా ప్రతిపక్షాలు ఇరికించాలని చూస్తే న్యాయస్థానాల్లోనూ, ప్రజల ముందు ప్రభుత్వం పలుచనవుతుంది.

ఇది విచారణకు నిలిచే కేసేనా?

ఈ కేసు విచారణకు నిలుస్తుందా? నిలువదా అనేది మనం తేల్చలేం. ఆధారాలను బట్టి కేసు విచారణ జరుగుతుంది. నిబంధనలు ఏమిటి? ఆధారాలు ఏమిటి? విదేశీ మారకం నిబంధనలు ఏం చెప్తున్నాయి? వంటి అనేక అంశాలుంటాయి. కేసుకు కావాల్సింది ఆధారాలు. ఇరు పక్షాలు సమర్పించే ఆధారాలను బట్టి కేసు కొనసాగుతుంది. ఏ కేసుకు ఆ కేసు ప్రత్యేకంగా ఉంటుంది. ఇందులో కక్షసాధింపు అనే ప్రస్తావన అనవసరం. సాధారణంగా రాజకీయ నాయకుల ప్రమేయం ఉన్న ఏ కేసు విచారణ జరిగినా కక్షసాధింపు చర్యలు అంటుంటారు.

'సూపర్‌బగ్స్'తో హడల్!

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, డిసెంబర్ 26 (నమస్తే తెలంగాణ): సూపర్ బగ్స్ పెరుగుతుండటంతో సామాన్యులు చికిత్స కోసం కొత్తగా అప్పులు చేయాల్సిన దుస్థితి దాపురిస్తున్నదని ఐసీఎంఆర్ (ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రిసెర్చ్) తాజా నివేదికలో వెల్లడించింది. ఈ వివరాలు అంతర్జాతీయ మెడికల్ జర్నల్ 'బీఎంజే ఓపెన్'లో ప్రచురితమయ్యాయి.

ఏమిటీ సూపర్‌బగ్స్?

యాంటీబయాటిక్స్‌కు కూడా లొంగని బ్యాక్టీరియా, వైరస్‌ల వంటి సూక్ష్మజీవులను సాధారణంగా 'సూపర్‌బగ్స్'గా పిలుస్తారు.

ఎలా ఏర్పడుతాయి?

మామూలు జ్వరానికి కూడా విరివిగా యాంటీబయాటిక్స్‌ను వాడటంతో సాధారణ బ్యాక్టీరియా, వైరస్‌లు కూడా రోగనిరోధకశక్తికి వ్యతిరేకంగా సులభంగా పోరాడగలిగే తర్ఫీదును పొందుతాయి. అప్పుడు చిన్న జ్వరానికి కూడా శక్తిమంతమైన మందులను వాడే పరిస్థితి వస్తుంది. అలాగే, పౌల్ట్రీ సెక్టార్‌లో కోళ్లు త్వరగా బరువు పెరుగడానికి, రోగాలపాలు గాకుండా కొందరు హానికరమైన యాంటీబయాటిక్స్ ఇంజెక్షన్లు వాడుతున్నారు. అలాంటి మాంసాన్ని తినడం కూడా శరీరంలో సూపర్‌బగ్స్ శక్తిమంతంగా మారడానికి దారితీయొచ్చని వైద్య నిపుణులు చెప్తున్నారు.

ఖర్చులు ఇలా..

సూపర్‌బగ్స్ కారణంగా సోకే వ్యాధుల కయ్యే ఖర్చు మామూలు జ్వరంతో పోలిస్తే చాలా ఎక్కువగా ఉంటుందని శాస్త్రవేత్తలు తెలిపారు. రోగనిరోధకశక్తిని పెంచడానికి శక్తిమంతమైన కొత్త మందులను ఇవ్వడంతో పాటు ఐసీయూలో చికిత్సనందించడమే దీనికి కారణంగా చెప్తున్నారు. సూపర్‌బగ్స్ చికిత్సకు దేశంలోని ఒక్కో ప్రైవేటు దవాఖానలో రూ. 3 లక్షల వరకు ఖర్చు పెట్టే సందర్భాలు కూడా ఉన్నట్టు వెల్లడించారు. దవాఖాన ఖర్చుల కోసం కొందరు తమ పొదుపు ఖాతాల్లోని డబ్బును వినియోగిస్తే, మరికొందరు అప్పులు చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఇంకొందరు స్థిర, చరాస్తులను తాకట్టు పెడుతున్నారని, మరికొందరు తమ దైనందిన అవసరాలను, ఆహారాన్ని తగ్గించుకొంటున్నట్టు తెలిపారు.

తోలుబొమ్మలాట కళాకారుడు జగన్నాథం మృతి

జనగామ, డిసెంబర్ 26 (నమస్తే తెలంగాణ): చెక్కతీగల తోలుబొమ్మలాట కళాకారుడు జనగామ జిల్లా నర్మెట మండలం అమ్మాపురానికి చెందిన మోతె జగన్నాథం (70) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. అరుదైన.. అంతరించిపోతున్న కళారూపాలకు జీవం పోస్తూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సహా ఢిల్లీ, లక్నో, మేఘాలయాలో పలు ప్రదర్శనలతో చెక్క బొమ్మలాటకు విశేష ప్రాచుర్యం కల్పించారు. ఆయన సేవలకు గుర్తింపుగా తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారం అందించింది. 'బొమ్మలోల్లు' అని ఆప్యాయంగా పిలుచుకునే మోతె జగన్నాథం, చెక్క తీగల తోలుబొమ్మలాట ద్వారా శతాబ్దాల నాటి కథా సంప్రదాయాన్ని పరిరక్షించడానికి అంకితమైన కళాకారుల బృందానికి నాయకత్వం వహించాడు. ఆయన ప్రదర్శనలు రామాయణం, మహాభారతం వంటి ఇతిహాసాలకు, ప్రహ్లాద, రామదాసు కథలకు ప్రాణం పోశాయి. మోతె జగన్నాథం ఆకస్మిక మృతి కళకు తీరని లోటని దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ మణికొండ వేదకుమార్ సంతాపం ప్రకటించారు.

మసూద్ అజర్‌కు గుండెపోటు

పాకిస్థాన్‌లో చికిత్స

కరాచీ, డిసెంబర్ 26: జైషే మహమ్మద్ వ్యవస్థాపకుడు, ఉగ్రవాది మౌలానా మసూద్ అజర్ గుండెపోటుకు గురయ్యారు. అఫ్గాన్‌లోని ఖోస్ట్ ప్రావిన్స్‌లో ఉన్న అతడిని వెంటనే చికిత్స కోసం పాకిస్థాన్‌కు తరలించారు. కరాచీలోని కంబైన్డ్ మిలిటరీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి ఎలాంట్ అప్‌డేట్ విడుదల చేయలేదు. మసూద్ అజర్ భారత్‌లో పలు ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడ్డాడు. 1999లో ఉగ్రవాదులు ఐసీ-1814 ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానాన్ని హైజాక్ చేసి భారత జైలులో ఉన్న అతడిని విడిపించుకున్నారు. అనంతరం జైషే మహ్మద్ సంస్థను స్థాపించాడు. 2016లో పఠాన్‌కోట్ దాడి, 2019లో పల్వామా దాడికి మసూదే ప్రధాన సూత్రధారి. 2019లోనే భారత్ ఉపా చట్టం కింద అతడిని ఉగ్రవాదిగా ప్రకటించింది.

బీబీనగర్ ఆర్మీ కళాశాల కనుమరుగు?

- విద్యార్థినులతో సహా ఉన్నపళంగా భవనం ఖాళీ
- ఆర్మీ పోల్స్, ఇతర సామాగ్రి అంతా తొలగింపు
- విద్యా సంవత్సరం మధ్యలో సర్కార్ దుశ్చర్య
- ఆర్మీ సిబ్బంది జీతాలు.. స్టూడెంట్స్ శిక్షణ బంద్
- ప్రశ్నార్థకంగా మారిన విద్యార్థినుల భవిష్యత్తు
- రాష్ట్ర ప్రభుత్వ ప్రతీకార చర్యలో భాగమే : ఆర్ఎస్పీ

బీబీనగర్ మండలం రాఘవపురంలోని సాంఘిక సంక్షేమ మహిళా ఆర్మీ కళాశాలలో తొలగించిన ఆర్మీ పోల్స్, ఎక్విప్‌మెంట్స్

యాదాద్రి భువనగిరి, డిసెంబర్ 26 (నమస్తే తెలంగాణ): దేశానికే దిక్సూచిగా మారిన యాదాద్రి భువనగిరి జిల్లాలోని సాంఘిక సంక్షేమ మహిళా ఆర్మీ డిగ్రీ కళాశాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఉన్నపళంగా విద్యాసంవత్సరం మధ్యలోనే కళాశాలను ఖాళీ చేయడంతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకమైంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో యాదాద్రి భువనగిరి జిల్లాకు ఆర్మీ కాలేజీ మంజూరైంది. సొంత భవనం లేకపోవడంతో బీబీనగర్ మండలం రాఘవపురంలో ప్రైవేట్ భవనంలో గురుకులాన్ని కొనసాగిస్తున్నారు. విద్యార్థులకు ఆర్మీ సిబ్బంది నిత్యం శిక్షణ ఇస్తూ మెరికల్లా తయారు చేస్తుండేవారు. ఇక్కడ చదివిన ఎంతో మంది విద్యార్థులు ఇప్పటికే ఉన్నత స్థానాలకు చేరుకున్నారు. దేశంలోనే ఎంతో పేరుపొందిన ఈ గురుకులాన్ని విద్యా సంవత్సరం మధ్యలోనే బంద్ చేయించే ప్రయత్నాలు జరుగుతున్నట్టు తెలుస్తున్నది. భవన యజమాని ఖాళీ చేయమన్నాడనే కారణాన్ని చూపుతూ గురుకులాన్ని బంద్ చేశారు. రాత్రికి రాత్రే విద్యార్థినులతో సహా భవనాన్ని ఖాళీచేశారు. దీంతో విద్యార్థులు తమ సామగ్రిని సర్దుకొని ఇంటిబాట పట్టారు. గత కొంతకాలంగా భవన యజమానికి అద్దె చెల్లించడంలేదని తెలుస్తున్నది. ఈ నేపథ్యంలోనే యజమాని కాలేజీ మేనేజ్‌మెంట్‌పై ఒత్తిడి తెచ్చినట్టు సమాచారం. అక్కడ ఉన్న ఆర్మీ పోల్స్, ఇతర సామగ్రిని పూర్తిగా తొలగించేశారు. ఆర్మీ సిబ్బంది బహుమతి ఇచ్చిన యుద్ధ ట్యాంకులు తుప్పుబట్టి పోతున్నాయి. ఆర్మీ సిబ్బందికి నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదు. తాత్కాలికంగా ఘట్‌కేసర్‌లోని ఓ కళాశాలలో తరగతులు నిర్వహిస్తున్నామని కళాశాల యాజమాన్యం చెప్తున్నప్పటికీ, సరిగ్గా నడవడం లేదని తెలుస్తున్నది. విద్యా సంవత్సరం మధ్యలోనే ఖాళీ చేయడంతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. దీంతో కాలేజీ కొనసాగింపుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మరొక చోటకు తరలిస్తం

భవన యజమానితో చేసుకున్న అగ్రిమెంట్ పూర్తయింది. యజమాని ఒత్తిడి మేరకే కళాశాలను ఖాళీ చేశాం. ఘట్‌కేసర్ పరిధిలోని అవుశాపూర్‌లో ఉన్న ఒక కళాశాలలో తాత్కాలికంగా తరగతులు నిర్వహిస్తున్నాం. త్వరలో బీబీనగర్ మండలంలోని అన్నంపట్లలో ఉన్న మరో కాలేజీకి షిఫ్ట్ చేస్తాం. ఆర్మీ సిబ్బందికి జీతాలు పెండింగ్ మాట వాస్తవమే. జనవరిలో జీతాలు చెల్లిస్తామని సెక్రటరీ తెలిపారు.

– నిరూప, ప్రిన్సిపాల్

రేవంత్‌రెడ్డి పాలనలో చీకట్లోకి..

ఒక నాడు దేశంలోనే మొదటి సాంఘిక సంక్షేమ మహిళా ఆర్మీ కళాశాలగా కీర్తించబడిన డిగ్రీ కళాశాల రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో శిథిలమైపోయింది. తెలంగాణ బిడ్డలు ఉక్కులాంటి ఆఫీసర్లయిన మేజర్ ఉషాశర్మ, రాఖీహాన్ కనుసన్నల్లో శిక్షణ పొందారు. ఇప్పుడు ఇదే తెలంగాణ పేద బిడ్డలను రేవంత్‌రెడ్డి మళ్లీ చీకట్లోకి నెట్టేశారు. గతంలో కేసీఆర్ పాలనలో ఈ కాలేజీ ఎంతో అద్భుతంగా నడిచింది. రిజర్వేషన్‌లో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మంత్రులైన మిత్రులారా, మీ చేతకానితనాన్ని ఎలా వర్ణించాలో మాటలు రావడం లేదు. దీనికి మళ్లీ సీఎంవో నుంచి ఏమైనా స్క్రిప్ట్ రావాల్నా భయ్యాలు?? భవన యజమాని ఖాళీ చేయమన్నాడనే ఏకైక సాకుతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా ఉన్నఫళంగా పేదబిడ్డలను మరోచోటుకు రాత్రికి రాత్రే తరలించారు. అక్కడ పని చేసే మిలిటరీ సిబ్బందికి 5 నెలల నుంచి జీతాలు లేవు. భారత సైన్యం బహుమతిగా ఇచ్చిన యుద్ధట్యాంకులు తుప్పు పడుతున్నాయి.– ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, బీఆర్ఎస్ సెక్రటరీ జనరల్

వేతనం 13 వేలే.. ప్రియురాలికి 4 బీహెచ్‌కే ఫ్లాట్

- వజ్రాల కళ్ల జోడు గిఫ్ట్
- మహారాష్ట్ర ప్రభుత్వ సంస్థకు 27 కోట్లు టోకరా

ముంబై , డిసెంబర్ 26 (నమస్తే తెలంగాణ): హర్షల్‌కుమార్ క్షీర్‌సాగర్.. ముంబైలో మహారాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో శంభాజీనగర్‌లో నడిచే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో తాత్కాలిక కంప్యూటర్ ఆపరేటర్. 23 ఏండ్ల అతని జీతం రూ.13 వేలు. హర్షల్ సంస్థలో భారీ మోసానికి తెరతీసి రూ.21 కోట్లను కొట్టేశాడు. పరారీలో ఉన్న హర్షల్ ఆ సొమ్ముతో లగ్జరీ కార్లు, బైక్, ప్రియురాలికి 4బీహెచ్‌కే ఫ్లాట్ కొని జల్సాలు చేశాడు. సంస్థ ఈ-మెయిల్ అడ్రస్‌ను పోలి ఉండేలా మరో నకిలీ ఈ మెయిల్‌ను సృష్టించి, సంస్థ పాత లెటర్‌హెడ్‌ను ఉపయోగించి ప్రస్తుత ఈ-మెయిల్ చిరునామా మార్చాలంటూ బ్యాంక్‌కు లేఖ రాశాడు. వారు మార్చడంతో బ్యాంక్ ఖాతాలకు సంబంధించిన ఓటీపీలు కొత్త ఈ-మెయిల్‌కే వచ్చేవి. తర్వాత ఇంటర్నెట్ బ్యాంకింగ్ సౌకర్యాన్ని ఉపయోగించి జూలై 1 నుంచి డిసెంబర్ 7 వరకు రూ.21.6 కోట్లను 13 బ్యాంక్ ఖాతాలకు తరలించాడు. రూ.1.2 కోట్లతో బీఎండబ్ల్యూ కారు, రూ.1.3 కోట్లతో ఎస్‌యూవీ, 32 లక్షలతో బీఎండబ్ల్యూ బైక్, గర్ల్‌ఫ్రెండ్‌కు 4 బెడ్రూంల ఫ్లాట్‌ను కొనుగోలు చేశాడు. వజ్రాలు పొదిగిన సన్ గ్లాసెస్‌ను, జత గాజులను ఆర్డర్ చేశాడు. దీని వెనుక ఇతర సిబ్బంది హస్తం ఉండవచ్చునని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ కేసుకు సంబంధించి అతని సహోద్యోగి యశోదశెట్టి, ఆమె భర్తను పోలీసులు అరెస్ట్ చేశారు.

గ్రూప్-1పై పిటిషన్ల కొట్టివేత

- నోటిఫికేషన్‌లో జోక్యం చేసుకోలేం
- హైకోర్టు ద్విసభ ధర్మాసనం తీర్పు
- వెబ్‌నోట్, డీకోడింగ్‌పై హైకోర్టును ఆశ్రయించొచ్చని సూచన

హైదరాబాద్, డిసెంబర్26 (నమస్తే తెలంగాణ): టీజీపీఎస్సీ గ్రూప్-1 నియామకాలపై గత ఫిబ్రవరిలో జారీచేసిన నోటిఫికేషన్‌లో జోక్యం చేసుకునేందుక